# నా శత్రువులకు కృతజ్ఞతలు

ఒక్క పరుగున ప్లేగ్రౌండ్ చేరుకుని ఉప్పాటకి బద్దీలు గీస్తున్నాను. అంతలో ఏడో క్లాసు మాధురి వచ్చి, "ఆనందీ! నిన్ను డోరతీ టీచర్ పిలుస్తున్నారు" అని చెప్పింది. ప్రాణం ఉసూరుమంది. మా కాన్వెంటులో డోరతీ టీచర్ కొక ప్రత్యేక స్థానం ఉంది. ఆవిడంటే అందరికీ గౌరవం, ఇష్టం. అంతకంటే ఎంతో భయం. అన్ని క్లాసుల వాళ్ళు ఆవిణ్ని గౌరవిస్తారు. మా పదో క్లాస్ కి ఆవిడ క్లాస్ టీచర్. చేసేది లేక ప్లేగ్రౌండ్ వదిలి స్టాఫ్ రూంలోకి వెళ్లాను.

"గుడ్ మార్నింగ్, మిస్! నన్ను పిలిచారా?" అన్నాను. నేను పదో క్లాసులోకి వచ్చాను. అంచేత టీచర్లంటే చిన్న క్లాసుల వాళ్ళు భయపడినంతగా భయపడను. అదీగాక నదురూ బెదురూ లేకుండా ఎవరితోనైనా నేను మాట్లాడగలనని డోరతీ టీచర్ నన్ను మెచ్చుకుంటారు.

"అవును. ఇలారా!" అని స్టాఫ్‌రూం పక్కనే ఉన్న డైనింగ్ రూంలోకి తీసుకువెళ్లారు డోరతీ టీచర్. ఆవిడ చేతిలో నా సైన్స్ పేపర్ ఉంది. నా గుండె జల్లుమంది. ఆవిడ నాతో ఏం మాట్లాడదలచుకున్నారో అర్థమయింది.

"చెప్పు! ఎందు కిలా తగలబెట్టావు పేపర్ని?"

"నేను ఫెయిలయ్యానా, మిస్?......"

"పాస్ కావటమేనా గొప్ప? నువ్వు ఈ పేపర్లో వ్రాయగలిగింది ఇంతేనా?"

"సారీ, మిస్! కూచుని ఓపిగ్గా రాయాలంటే విసు గొచ్చింది. ఏభయి మార్కుల వరకూ కూడుకుని అన్ని మార్కులు వచ్చేలాగ ఆన్సర్సు రాశాను."

డోరతీ టీచర్ ఆశ్చర్యంగా, కోపంగా నా వంక చూశారు.

"ఆనందీ! ఏభై మార్కులవరకు కూడుకుని ఆన్సర్లు వ్రాస్తే ఏభై మార్కులూ వస్తాయనుకుంటున్నావా? ఎందు కింత అహంకారం నీకు?"

"కనీసం నలభై అయినా రావా? నాకు అన్నీ వచ్చు. నేను చాలా బాగా రాశాను."

"అవును నీకు అన్నీ వచ్చు. అందుకె నిన్ను చూస్తే నాకు కోపం. ఒక క్రమం అనేది లేకుండా అన్ని విషయాలూ నీ మూడ్‌నికి వదులేస్తున్నానని...... ఏభై మార్కులు వచ్చేలా నువ్వు కూడుకుని వ్రాస్తే, నీకు వచ్చినవి ముప్పై అయిదు. నువ్వన్నట్లు నీ కన్నీ వచ్చు కనకే ఈ మాత్రంగానైనా వచ్చాయి మార్కులు. అన్నీ నీ అంచనాల ప్రకారమే జరుగుతాయని అనుకోకు. నువ్వు నీకు తెలిసినది ఆధారంగా అంచనాలు వేసుకుంటావు. నీకు తెలియని ఎన్నో విషయాలున్నాయి. అవి నీ అంచనాలను తల క్రిందులు చేసేస్తాయి.

నేను ఏం మాట్లాడలేదు. డోరతీ టీచర్‌కి ఎదురు చెప్పలేను.

"అది సరే! ఈ మాత్రమయినా ఎందుకు కష్టపడ్డావు? బ్లాంక్ పేపర్ ఇచ్చి బయటికి పోకపోయావా?" కోపంగా అడిగారు డోరతీ టీచర్. నేను ఆవిడకి నిజమే చెప్పేశాను. ఫేలయితే మా అమ్మ తిడుతుంది టీచర్! అందుకే పాస్ మార్కులు వచ్చేలా రాశాను."

డోరతీ టీచర్ నన్ను తెల్లబోయి చూశారు. ఆ చూపులను ఎదుర్కోలేక పోయాను.

"నేను వెళ్ళతాను మిస్! మా పార్టీ నేను లేకపోతే ఓడిపోతుంది" అనేసి ప్లేగ్రౌండులోకి పరుగున వచ్చేశాను. మా పార్టీ హర్షధ్వానాలతో నన్ను ఆహ్వానించింది.

మా ఆట అయిపోయిన తరువాత థెరిసా నాతో రహస్యంగా— "డోరతీ టీచర్ నిన్నెందుకు పిలిచారు?" అంది. థెరిసాకీ, నాకు స్నేహమెంతో స్పర్థ అంత. థెరిసా ఎంతసేపూ తన గొప్పలు చెప్పుకోవాలనుకుంటుంది. అందరి కంటే తా నేదో ఎక్కువ అన్నట్టు మాట్లాడుతుంది. నేను గొప్పలు చెప్పుకోను. కానీ, నన్ను తక్కువ చేస్తే మాత్రం సహించలేను. ఆ కారణం చేత స్నేహంలో స్పర్థ తప్పడం లేదు.

పదో క్లాసు పేరు చెప్పగానే ఆ కాన్వెంట్‌లో ఎవరికైనా ముగ్గురు విద్యార్థినులు గుర్తు వస్తారు. మొట్ట మొదటి వ్యక్తి మాధవి. మాధవి క్లాసులో కూడా మొట్టమొదలే ఉంటుంది. ఎప్పుడు ఫస్ట్‌రాంక్ తనదే! టీచర్లంటే ఎంతో భయభక్తులు. పుస్తకాలన్నీ నీట్‌గా ఉంచుకోవటం, నోట్సులు సక్రమంగా రాయటం, వేళకి రావటం— ఇలాంటి లక్షణాల వల్ల టీచర్లందరికీ మాధవి అంటే చాలా ఇష్టం. మాధవి అసలు ఆడదు. మాకంటె ఆ అమ్మాయి వయస్సులో కాస్త పెద్ద. చిన్నప్పుడు జబ్బుచేసి రెండు సంవత్సరాల కాలం పోయిందిట. పదో క్లాసులోనే చీరలు కడుతూంది. మాధవికి కొద్దిగా నత్తి కూడా ఉంది. దొరికి పోకుండా మాట్లాడటానికి విశ్వప్రయత్నం చేస్తుంది. కాని, అప్పుడప్పుడు దొరికిపోతుంది అలా దొరికిపోయినప్పుడు. చుట్టుపక్కల వాళ్ళు నవ్వినప్పుడు ఆ అమ్మాయి చాలా

బాధ పడుతుంది. ఆటల పిరియడ్‌లో కూడా ఆ అమ్మాయి ఆడుకోదు. క్లాసురూంలో కూచుని చదువుకుంటుంది. పి. టి. క్లాసులకి తప్పనిసరిగా వస్తుందికాని, ఆ ఎక్సర్ సైజెస్ సరిగ్గా చెయ్యలేదు.

థెరిసా అంటే కూడా టీచర్లకు అభిమానమే. సింహంలా టేబుల్ ముందు నిలబడి టీచర్ కంటె ఎక్కువగా క్లాస్‌ని కంట్రోల్ చెయ్యగలదు. ఏవైనా మీటింగులు జరిగినప్పుడు చురుగ్గా దక్షతతో అన్ని పనులూ నిర్వహించగలదు. క్లాసు లీడర్‌గా స్టూడెంట్సంతా థెరిసానే ఎన్నుకుంటారు ఎప్పుడూ. థెరిసా దగ్గర గొప్ప తెలివితేటలూ లేవు. కష్టపడి చదివే ఓపికా లేదు. కానీ, గడుసుతనం ఉంది. ఎవరిని ఎలా ఉపయోగించుకోవాలో తెలుసు. మాధవితో ఇచ్చకాలాడుతూ, మాధవితో స్నేహంచేసి, మాధవి నోట్స్ అవి అడిగి తీసుకుని ఎక్కించుకుంటుంది. తను హోం వర్కు చెయ్యలేక పోతే, మాధవి హోం వర్కు కాపీ కొట్టేస్తుంది. క్లాస్ లీడరయిన థెరిసా తన స్నేహం కోరుతున్నందుకు మాధవి చాలా సంతోషించి, థెరిసా కోరిన సహాయమంతా చేస్తుంది. అలా ఎలాగో ఒకలాగ బాగా చదివే పిల్లల్లో ఒకతెగా లెక్కలోకి వస్తోంది థెరిసా. ప్రోగ్రెస్ రిపోర్ట్‌లో పదో రాంకో, పన్నెండో రాంకో, కనిపించినప్పుడు "నా ఆన్సర్స్ చాలా హై స్టాండర్డులో ఉంటాయి. టీచర్లకి కూడా అర్థంకావు. ఏవో మార్కులు పడేస్తారు" అంటుంది. థెరిసా నోటికి జడిసి ఎవరూ మాట్లాడరు.

నేనంటే టీచర్లకు అభిమానమెంతో, కోప మంత! పాఠం శ్రద్ధగా వింటాను. ఒక్క నోట్సూ నీటుగా రాయను. ఏ ప్రశ్న కయినా నోటితో చక్కగా సమాధానం చెబుతాను. రాయమంటే విసుగు వచ్చి సాధ్యమయినంత క్లుప్తంగా రాసి పారేస్తాను. పరమ అల్లరి పిల్లగా ప్రఖ్యాత చెందాను. అన్నీ తెలిసినట్లు మాట్లాడుతాను కనక నా క్లాస్‌మేట్స్ నన్ను చిన్నచూపు చూడలేరు. ఫస్ట్ రాను కనక గౌరవమూ ఇయ్యరు. నా అల్లరి సరదాగా ఉంటుంది కనక నాతో స్నేహంగా ఉంటారు.

డోరతీ టీచర్ నన్ను ఎందుకు పిలిచారో తెలుసుకోవాలని థెరిసా కుతూహల పడటం నాకు వింతగా లేదు. థెరిసా ఎప్పుడూ అందరి విషయాలూ కూపీలు లాగుతూనే ఉంటుంది. 'ఇది కూడా లీడర్ లక్షణం కాబోలు!' అనుకుంటాను నేను.

"పేపర్ ఎందుకు పాడుచేశానని అడిగారు. రాయటానికి బద్ధకం వేసి రాయలేదని చెప్పాను" అన్నాను.

థెరిసా అదోలా మాదిరిగా నవ్వి, "బద్ధకం లేకపోతే మాత్రం అంతకంటే ఏం రాస్తావులే!" అంది.

ఇదీ థెరిసాలో గొప్ప లక్షణం— ఎదటి మనిషిని తనకు ప్రాణ స్నేహితురాలుగా నమ్మించగలదు. అదే సమ

యంలో పూచిక పుల్లను తీసి పారేసినట్లు తీసి పారెయ్య గలదు. మనసును బాధపెట్టే మాట లనగలదు.

నా కెంతో రోషం వచ్చింది కానీ, ఏమని చెప్ప గలను? 'పేపర్లో రాయకపోయిన తరవాత థెరిసాతో వాదించి ప్రయోజనం ఏమిటి? అనుకుంటే అనుకోనీ!' అనుకున్నాను.

"ఆ నత్తి మొహంది ఈ సారి కూడా ఫస్టుమార్కు కొట్టేసిందటనా?" వికారమైన స్వరంతో మళ్ళీ అడిగింది థెరిసా.

తెల్లబోయాను, మాధవీ, థెరిసాలు ప్రాణస్నేహి తులని అందరికీ తెలుసు. అలాంటి మాధవిని గురించి, తను ఎన్నో విధాల సాయం పొందుతూన్న మాధవిని గురించి ఇలా మాట్లాడుతుందా థెరిసా?

"ఏమో! ఎవరికి ఫస్టు వచ్చిందో నాకు తెలియదు. నన్ను అడిగినదానికి సమాధానం చెప్పాను. అనవసరంగా నేనేమి మాట్లాడలేదు."

థెరిసా గతుక్కుమని, "డోరతీ టీచర్ నీతో ఏదైనా మాట్లాడతారు. మేమూ, మేమూ క్రిస్టియన్సమి కదా!" అంది.

ఇదీ నాకునచ్చలేదు. "డోలతీ టీచర్ కి అందరంటేనూ

అభిమానమే. నేను క్రిస్టియన్‌ని కాకపోయినా, అభిమా నిస్తారు" అన్నాను.

"మా కులం గొప్పది. అన్ని కులాలను సమానంగా చూస్తాం మేము!" ఆలోచించిన కొద్దీ ఆ మాటలు చాలా తమాషాగా అనిపించాయి ఫకాలున నవ్వేశాను. నేను నవ్వాక తన మాటల్లో తెలివితక్కువ అర్థమయి ముఖం ముడుచుకుంది థెరిసా. మా మధ్య ఇలాంటి చిరపరలు మామూలే.

మరొక రోజు థెరిసా అతి రహస్యంగా "మాధవికి పెళ్ళియిపోయింది తెలుసా!" అంది.

నేను ఆశ్చర్యపోయాను.

"నిజంగా?"

"అవును. కావాలంటే చూడు. మంగళసూత్రాలు జాకెట్‌లో దాచుకుంటుంది. మొగుడు వదిలేశాట్ట! అందుకే ఈ రహస్యం!"

"పాపం!"

"కాకపోతే ఈ నత్తిదాన్ని ఎవరు ప్రేమిస్తారులే!"

"నాకు ఎలాగో అనిపించింది. ప్రేమలు, పెళ్ళిళ్ళు

గురించి మాకు బాగా తెలియదు. అయినా, అలాంటి మాటలు మాట్లాడుకోవడం సరదాగానే ఉంటుంది. రహస్యంగా మాట్లాడుకుంటాం! సినిమాల్లో చూపిస్తారుగా— అలాగే ఉంటుంది ప్రేమ. నా కాడైలాగులన్నీ వచ్చు. నిజంగా ఎవరితోనూ మాట్లాడలేదు. ఊహల్లో చాలా మందితో మాట్లాడాను. మాధవిని మొగుడు వదిలేసిన విషయం కంటె అది మాధవి స్నేహితురాలినని చెప్పకునే థెరిసా చెప్పిన తీరు ఘోరంగా అనిపించింది నాకు. థెరిసాను చూస్తే భయం వేసింది.

మా కాన్వెంట్‌కి అప్పుడప్పుడు విజటర్స్ వస్తూంటారు. అలా ఒకసారి ఎవరో ఒకావిడ వచ్చింది. టీచర్స్ అందరూ ఇస్తూన్న గౌరవాన్ని బట్టి ఆవిడ ఎవరో చాలా గొప్పావిడ అనుకున్నాము. ఆవిడ మా అందర్నీ ఏవో ప్రశ్నలు వేసింది. నన్ను అడిగిన ప్రశ్నలన్నింటికీ నేను బాగా సమాధానం చెప్పాను. ఆవిడ నన్ను మెప్పుదలగా చూస్తూ, "మీ క్లాస్‌లో ఫస్టు నువ్వేనా?" అంది. నేను వెంటనే సమాధానం చెప్పలేక పోయాను. అప్పుడు మాధవి గర్వంగా లేచి నిలబడి, "నేను ఫస్టు, మేడమ్!" అంది. ఆవిడ ఊరుకున్నా పోయేది. అలా కాక "అరే! నువ్వు ఫస్టు కాదా?" అంది. నన్ను చిన్నబుచ్చితే సహించలేని లక్షణమేదో నాలో ఉంది. వెంటనే— "నేను పుస్తకాల పురుగుని కాను. అస్తమానమూ క్లాసు పుస్తకాలు రుబ్బి ఫస్టు సంపా

దించలేను కాని, జనరల్ బుక్స్ చాలా చదివి జనరల్ నాలెడ్జి చాలా సంపాదించాను" అన్నాను. ఆవిడ నవ్వి, "గుడ్!" అని వెళ్ళిపోయింది. తరవాత మాధవికి నా మీద చాలా కోపం వచ్చింది. "నేను పుస్తకాల పురుగునిట! మరి తనూ? కుళ్ళు బోతు పురుగు! నేను ఫస్టు వస్తున్నానని కుళ్ళుతో అలా అంటుంది" అంది.

నిజానికి అంతకు ముందెప్పుడూ నాకు మాధవి మీద ఈర్ష్య లేదు. నేను ఫస్టు రావటానికి ప్రయత్నిస్తేకద, వచ్చిన వాళ్ళమీద ఈర్ష్య పడటానికి? కానీ, మాధవి మాటలతో నాకు రోషం వచ్చింది.

"అబ్బో, ఫస్టు! మరి, ఆ ఫస్టుగారు పుస్తకాల్లో పాఠాలకు తప్ప మరి దేనికి నోరు మెదపలేరేం?" అన్నాను.

అలా మా మధ్య వైరం ప్రారంభమైంది థెరిసా తన శాయశక్తులా మా మధ్య రాజుకున్న ఆ అగ్నిలో ఆజ్యం పోస్తూనే ఉంది. నాతో ఎప్పటికప్పుడు— "మాధవి నిన్నిన్నిలా అంది, అలా అంది" అని చెప్పేది. మాధవి, థెరిసాలు స్నేహితులు కనక మాధవి ఆ మాటలు అన్నదని నేను నమ్మి మరింత రెచ్చిపోయి మాత్రం అవకాశం దొరికినా మాధవిని ఏడిపించేదాన్ని.

ఒక రోజు డోరతీ టీచర్ నన్ను పిలిపించి, "సీతూ,

మాధవికి పడటం లేదని విన్నాను. చిన్న పిల్లలు, ఏమిటీ తగవులు: మాధవితో మాట్లాడెయ్యి" అన్నారు. డోరతీ టీచర్ మాట కాదనలేను నేను. ఆ రోజే వెళ్ళి మాధవిని పలకరించాను. మాధవి ముక్తసరిగా సమాధానం చెప్పింది.

ఆ సాయంత్రమే థెరిసా ప్లే గ్రౌండ్‌లో నా దగ్గరికి వచ్చింది. "నువ్వు చచ్చినట్లు తన స్నేహంకోసం పాకులాడుతున్నావుట! మాధవి అంది" అని చెప్పింది. నేను పట్టరాని ఉద్రేకంతో ఆ మరునాడే అందరి ముందూ మాధవి దగ్గరికి వచ్చి, "మాధవీ! నేను నీ స్నేహం కోసం పాకులాడటం లేదు. నాకు నీ నోట్సులక్కర్లేదు. నాకు తెలీని పాఠాలు నువ్వు చెప్పక్కర్లేదు. నీతో నాకే అవసరమూ లేదు. ఒకే క్లాసులో ఉన్న వాళ్ళం. విరోధాలెందుకని మాట్లాడాను. అంతే!" అని గబగబా చెప్పేసి నా సీట్లోకి వచ్చి కూర్చున్నాను. మాధవి తెల్లబోయింది. క్లాసంతా మమ్మల్ని గమ్మత్తుగా చూశారు. ఆ తరవాత థెరిసా నాతో— "నేను చెప్పిన రహస్యం మాధవి నెందుకు అడిగేశావు?" అని పోట్లాడింది. నాకు ఒళ్ళు మండిపోయింది. "రహస్యాలు చెప్పమని బ్రతిమాలానా నిన్ను? నువ్వు చెప్పే రహస్యాలు వినలేక చస్తున్నాను, నీకు పుణ్యముంటుంది, ఇకముందైనా నాకు రహస్యాలు చెప్పకు" అన్నాను. ఎప్పుడూ క్లాస్ లీడర్‌గా ఉండటానికి అలవాటు పడిన థెరిసా నా ఈ తిరుగుబాటు సహించలేకపోయింది. నాతో మాట్లాడటం మానే

సింది. నేను లెక్క చెయ్యలేదు. అప్పటినుండీ మాధవీ, థెరిసా మరింత సన్నిహితు లయ్యారు. థెరిసా ఎలాటి రహస్యాలు చెప్పగలదో నాకు బాగా తెలుసు. నేను దెబ్బతియ్యటానికి అవకాశం కోసం కాచుకుని కూచున్నాను.

అది డోరతీ టీచర్ క్లాసు. టీచర్ ఏదో ప్రశ్న అడిగారు. మాధవి సమాధానం చెప్పబోయి నత్తిరావటం వల్ల "ము...... ము ......" అని తడబడింది. నేను వెంటనే "ము......ము......ము......ముద్దంటే చేదా?" అని పాడాను. క్లాసంతా గొల్లుమంది. మాధవి ముఖమంతా ఎర్రబడగా, కళ్ళలో నీళ్ళు తిరుగుతూ ఉండగా సీటులో కూర్చుండి పోయి డెస్కులో ముఖం దాచుకుంది. అప్పుడు డోరతీ టీచర్ నా వంక చూసిన చూపు ...... అబ్బ! ఏం చూపు అది! నిలువునా వణికాను. దేనికీ భయపడని నాకు శరీర మంతా చెమటలు పట్టాయి.

"క్లాసయిపోయాక ఒక సారి స్టాఫ్ రూంకి రా!" అన్నారు డోరతీ టీచర్.

మాధవి డెస్కు చాటున ముఖం దాచుకుని ఏడుస్తోంది. ఆ దృశ్యం చూడలేక పోయాను. ఎంతపని చేశాను!

స్టాఫ్ రూంలోనికి వెళ్ళాను. "ఇలా రా!" అని ఎప్పటిలా డైనింగ్ రూంలోకి తీసుకు వెళ్ళారు డోరతీ టీచర్.

"నువ్విప్పుడు పాడావే — ఆ పాటకి అర్థం నీకు తెలుసునా?"

నేను పసిదాన్ని కాదు. ఆ పాటకి అర్థం తెలుసు, కానీ, నే నదంతా ఆలోచించి ఆ పాట పాడలేదు.

"ఈ పాట నీ నోటి నుండి రావలసినదేనా? అందు లోనూ క్లాస్ రూంలో......"

నేను తల వంచుకున్నాను.

"పాపం, మాధవి ఇప్పుడున్న పరిస్థితుల్లో నీ పాట ఆమె మనసు నెంత గాయపరుస్తుందో ఊహించావా?"

నాలుక కరచుకున్నాను. నా అపరాధం రాను రాను మరింత వికృతంగా ప్రత్యక్షమవుతూంది నా ముందు.

"వెళ్ళి మాధవికి క్షమార్పణ చెప్పుకో!"

నా శరీరం అంతా చల్లగా అయిపోయింది. నన్ను చూడగానే మొహం తిప్పుకునే మాధవిని — 'నువ్వు నా కంటె ఎంతో తక్కువ సుమా!' అన్నట్లు అహంకారంతో తల విదిలించే మాధవిని— ఎలా క్షమార్పణ కోరుకోను?

"వెళ్ళు!" కఠినంగా అన్నారు డోరతీ టీచర్.

నేను ఎందుకైనా సిద్ధపడి తల అడ్డంగా తిప్పాను, వెళ్ళనట్లుగా.

"ఏమిటి? ఇంతచేసి క్షమాపణ కోరుకోలేవా." కోపంగా అడిగారు డోరతీ టీచర్.

"క్షమాపణ కోరుకుంటాను. కానీ......"

"ఇంకా ఏమిటి కానీ......"

"ఇప్పుడు కాదు. ఈ పరీక్షల్లో నేను ఫస్టు వచ్చాక."

తెల్లబోయి నా వంక చూశారు డోరతీ టీచర్. ఆవిడ ముఖంలో కుతూహలమూ. సంతోషమూ...... రెండూ కనిపించాయి.

"నువ్వు ఫస్టు రాగలవా?"

రోషంగా తల ఎత్తాను నేను.

"ఎందుకు రాలేను?"

డోరతీ టీచర్ నవ్వారు. ఆ నవ్వు గమ్మత్తుగా కనిపించింది నాకు. నాలో పట్టుదల మరింత పెచ్చింది.

మాకు పబ్లిక్ పరీక్షలు సరిగ్గా రెండు నెల లున్నాయి. పుస్తకాలు తీసి అతి శ్రద్ధగా చదవటం మొదలుపెట్టాను.

ఆటలు మానేశాను. కానీ, ఏం లాభం? నా దగ్గర ఒక్క నోట్సూ సరిగ్గాలేదు. హిందీలో తెలుగు, ఇంగ్లీష్‌లో హిస్టరీ లెక్కల్లో డ్రాయింగు... ఇలా కలగాపులగంగా ఉన్నాయి నా నోట్సులు. నాలో ఒక క్రమ పద్ధతి లేదు. ఎప్పుడు ఏది ఎక్కడ రాయాలనిపిస్తే అక్కడ రాసేదాన్ని. ఏ సందేహం వచ్చినా నా దగ్గర ఉన్న నోట్సులన్నీ ఆ మూలనుంచి ఈ మూలకి తిరగవెయ్యవలసిందే! క్లాసులో శ్రద్ధగా వినటం తప్ప ఏ రోజు పాఠం ఆ రోజు చదివే అలవాటు లేదు. అన్నీ ఒక్కసారిగా చదవాలంటే అంతా గజిబిజిగా అని పించసాగింది. ఎప్పుడూ పుస్తకం పట్టుకుని వదలని నన్ను చూసి అమ్మ భయపడి అంతగా చదవద్దని మందలించింది, నేను వినిపించుకోలేదు. అదేపనిగా చదివినందువల్ల పరీక్షల సమయానికి నాకు రక్త విరేచనాలు పట్టుకున్నాయి. అలాగే పరీక్షకు వెళ్ళాను. పేపర్ చూడగానే సంతోషంతో నా ఒళ్ళు నాకు తెలియలేదు! కాపీలు ఎక్కువగా జరుగుతున్నా యని ప్రశ్నలన్నీ మెలిక తిప్పి ఇచ్చారు. పుస్తక జ్ఞానంతో పాటు కొంచెమో, గొప్పో సొంతంగా ఆలోచించగలిగిన వాళ్ళే ఆ పేపర్ బాగా రాయగలరు. మనసుకున్న సంకల్పం బలం ఎంత గొప్పదో కాని, ఇంటి దగ్గర కట్టకుండా విరేచ నాలు అవుతున్నా— మూడు గంటలు కదలకుండా రాయ గలిగాను. అన్ని పేపర్లూ అలాగే ఉన్నాయి. ముఖ్యంగా లెక్కల పేపరు చాలా తికమకగా ఉంది. బాగా మనసు

పెట్టి ఆలోచిస్తే కాని ఒక్కటి అర్థంకాదు. పాపం, మాధవి చాలా శ్రద్ధగా కష్టపడి చదువుతూందే కాని, సొంతంగా ఏదీ ఆలోచించలేదు.

నాకు లెక్కలు మొదటి నుంచీ బాగానే వచ్చు. ఓపిగ్గా కూచుని చదవక్కర్లేదుగా! అప్పటి కప్పుడు ఆలోచించి సాల్వ్ చెయ్యాలి. అంచేత బాగా చెయ్యగలిగే దానిని. మాధవి లెక్కల పేపర్లో బాగా దెబ్బతింది. పరీక్ష లయిపోయాయి. నాకు సంతృప్తిగానే ఉంది. అయినా, సెలవు లన్నీ ఒక విధమయిన టెన్షనుతోనే గడిపాను. రిజల్ట్స్ వచ్చాయి. నా ఆనందానికి అంతులేదు. నాకు ఏకంగా ప్రెసిడెన్సీ ఫస్ట్ వచ్చింది!

స్కూల్స్ తెరవగానే అందరమూ కాన్వెంట్ కి వచ్చాము. మాధవికి ఫస్ట్క్లాస్ వచ్చింది. అయినా, పాపం ఎప్పటిలా స్కూల్ ఫస్ట్ రాలేకపోయానని బాధపడుతూంది. నేనూ మాధవి దగ్గరకు వెళ్ళి రెండు చేతులూ పట్టుకున్నాను.

"మాధవీ! ప్లీజ్! నన్ను క్షమించు. నేను చాలా మూర్ఖంగా ప్రవర్తించాను. ఏ నాడో నిన్ను క్షమాపణ కోరుకోవలసింది. కానీ, నీ ఎదట నిలిచి నా తప్పు ఒప్పుకోవటానికి కావలసిన మనోబలం కూడదీసుకోవటానికి ఇంత కాలం పట్టింది."

నేను ఇంతగా ప్రాధేయ పడుతున్నట్లు మాట్లాడి నందుకు మాధవి వింతగా చూసింది.

"ప్రెసిడెన్సీ ఫస్ట్ వచ్చావు. కంగ్రాట్యులేషన్స్" అంది బాధను కప్పుకుంటూ, మర్యాదకోసం.

"అంత కంగ్రాట్యులేట్ చెయ్యవలసిందేమీ లేదు, మాధవీ! ఈ పరీక్షలు వట్టి గాంబ్లింగ్. ఆ పేపర్లు అలా రాక పోతే, లెక్కలపేపర్ అంత తికమకగా లేకపోతే, నాకు ఫస్ట్ క్లాసు కూడా వచ్చేది కాదు."

"ఎంత మారిపోయావు!" అప్రయత్నంగా అనేసింది మాధవి.

డోరతీ టీచర్ నన్నెంతో అభిమానంగా కంగ్రాట్యులేట్ చేస్తూ, "నాకు తెలుసు, ఆనందీ! తలచుకుంటే నువ్వు పైకి రాగలవు. కావాలని నిర్లక్ష్యంగా చదువుతూ ఆటలాడే దానివి. ఇకముందు ఎప్పుడూ ఇలాగే ఫస్టు రావాలి" అన్నారు ప్రశంసా, మందలింపూ రంగరించి.

"ఒక్క చదువులోనే కాదు టీచర్! మొత్తం జీవితంతోనే ఆటలాడాను. చదువులో ఏ రకంగా అతి నిర్ల క్ష్యంగా అన్నీ వచ్చనుకుంటూ, ఏ నోట్సూ లేకుండా గడిపానో, అలాగే జీవితంలోను అతి నిర్లక్ష్యంగా ఇష్టం వచ్చి నట్లు నా ఉద్రేకాలకు లొంగిపోతూ ప్రవర్తించాను. చదువు పరీక్షలో నెగ్గాను. ఈ పరీక్ష గాంబ్లింగ్ లాటిదేనని అర్థం

చేసుకున్నాను. ఈ పరీక్ష మాత్రమే కాదు, టీచర్— జీవితంలో మనకు ఎదుర్కొనే జయాపజయాలన్నీ గాంబ్లింగ్ లాంటివేనేమో? ఇక ముందు ఎప్పుడూ ఇలాగే ఫస్ట్ రావాలని ప్రయత్నించు. కానీ, ప్రతి విషయానికీ ఒక క్రమ పద్ధతి అవసరమని అర్థం చేసుకుంటాను. నాకు తెలిసినదానికంటె తెలుసుకోవలసినదే ఎంతో ఉందని గుర్తిస్తాను. నా ఉద్రేకాలకు నా వ్యక్తిత్వం బానిస కాకుండా జాగ్రత్త పడతాను. నిజంగా మాధవి మీద నాకు ఏ శత్రుత్వమూ లేదు. కానీ, మనసులో శత్రుత్వం పెట్టుకున్న వాళ్ళకంటె హీనంగా ప్రవర్తించాను."

నాకు కళ్ళలో నీళ్ళు తిరిగాయి. డోరతీ టీచర్ నా భుజం తడుతూ, "గుడ్! ఒక్కసారిగా ఎంతో ఎదిగిపోయావు. ఇంత మార్పు నీలో నేను ఆశించలేదు" అన్నారు.

"ఇందుకు కారణం నా శత్రువులు— కాదు— నాతో శత్రుత్వం వహించిన వాళ్ళు. వాళ్ళకి నా కృతజ్ఞతలు."

మనసులో థెరిసాకి కృతజ్ఞతలు చెప్పుకున్నాను.